## సింగిల్ పేజీ కథలు

# నైజం

''ఏమేవ్! ఎవరో వచ్చారు చూడు'' పేపర్ చదువుతూ మావారు పెట్టిన కేక విని వాకిట్లోకి వచ్చాను తడి చేతిని కొంగుకు తుడుచుకుంటూ.

వాకిట్లో జడ్జిగారి భార్య అరుంధతమ్మగారిని చూస్తూ- ''రండి రండి! లోపలికి. ఏమిటాంటీ! పొద్దున్నే ఇలా వచ్చారు. ఏమిటి విశేషం?'' అన్నాను.

''ఆ... ఏం లేదు. మరి... మరి...'' అంటూ నీళ్లు నములుతున్న ఆవిడ్ని చూసి ఆశ్చర్యపోయాను. ఈ వీధిలో మంచి పేరుప్రఖ్యాతులున్న జడ్జిగారి భార్య. ఎప్పుడూ అందరిమీదా పెత్తనం చెలాయించే ఈవిడ ఈవేళలో ఎందుకు వచ్చిందో అర్థం కాలేదు నాకు.

''చెప్పండి పర్వాలేదు'' అన్నాను.

''ఆ.. ఏంలేదు. మా పృధ్వి నిన్న ఒకమ్మాయిని రిజిస్టరు మ్యారేజీ చేసుకుని ఇంటికి తీసుకువచ్చాడు. హఠాత్తుగా ఇలా వాడు చేసేసరికి నేనూ వాళ్ల నాన్నగారూ చాలా బాధపడ్డాం'' అంటూ కళ్లనీళ్లు పెట్టుకుంది.

''పోన్లెండి ఆంటీ! ఇవాళ రేపు పిల్లలు అలాగే వున్నారు. బాధపడకండి'' అన్నాను ఊరడింపుగా.

''అది కాదు, వాడు ఆ అమ్మాయిని చేసుకుంటానని ముందుగా చెప్తే మేము వెళ్లి అమ్మాయి తరపున పెద్దవాళ్లతో మాట్లాడి చేస్తాం కదా! వాళ్లంతట వాళ్లే ఇలా తొందరపడడం వలన మాకు ఎంత అప్రతిష్ట'' అన్నది కళ్లనీళ్లు తుడుచుకుంటూ.

''అవుననుకోండి! ఇంతకీ అమ్మాయి ఎలా ఉంటుంది?''

''పిల్ల బాగానే వుంటుంది కానీ ఇలా చేశాడనే మా బాధ. చిన్నప్పటి నుంచీ ఒక్కడే కొడుకని అతి గారాబంగా పెంచి, మంచి చదువు చెప్పించాం! చివరికి ఇలా చేస్తాడనుకోలేదు'' అన్నది అరుంధతమ్మ ముక్కును పైకి ఎగబీలుస్తూ.



''పోనీలెండి. అయిపోయిందేదో అయిపోయిందిగా. మీరు దీని గురించి బాధపడకండి'' అంటూ ఓదార్చాను.

''అందుకే రేపు బాలాజీ టెంపుల్‌లో సాంప్రదాయం ప్రకారం వాళ్లిద్దరికీ వివాహం చేయాలనుకుంటున్నాం. మీ దంపతులిద్దరూ వచ్చి వాళ్లను ఆశీర్వదించాలి'' అంటూ బొట్టు పెట్టి వెళ్లింది.

★ ★ ★

రామారావు, అరుంధతమ్మగార్ల ఏకైక సంతానం పృధ్వి. ఏడు తరాలు తిన్నా తరగని ఆస్తి! చిన్నప్పటి నుంచీ అతి గారాబంగా పెంచటం వలన తాననుకున్నదే చెల్లాలన్న మొండితనం అలవర్చుకున్నాడు.

ఆ మర్నాడు నేను మావారు రెడీ అయి బాలాజీ టెంపుల్‌కి వెళ్లాం. బాగా పరిచయమున్న ఓ పదిమంది దంపతులు మాత్రమే ఉన్నారక్కడ. ఎంత పెళ్లి వేడుక జరుగుతున్నా రామారావు అరుంధతమ్మగార్ల ముఖాలు మాత్రం వడిలిపోయినట్టున్నాయి. వాళ్లని చూడగానే జాలేసింది. ఓ ప్రక్క పృధ్వి మీద కోపం కూడా వచ్చింది.

''పిల్ల కుందనపు బొమ్మల్లే ఉంది. ఇంక మీరు జరిగిన విషయం మర్చిపోయి కొత్త దంపతులిద్దర్నీ సంతోషంగా ఆహ్వానించండి'' అంది మునసబుగారి భార్య.

''అవునండీ! ఈడూ జోడూ చక్కగా కుదిరింది. ఎంత ప్రేమించి చేసుకున్నా అందగత్తెనే భార్యగా చేసుకున్నాడు మీ అబ్బాయి'' మనసులో మాట బయటపెట్టింది శాస్త్రిగారి భార్య.

ఎంతమంది ఎన్ని రకాలుగా చెప్పినా ఆ దంపతులిద్దరి ముఖాల్లో విషాదఛాయలు పోలేదు.

ఇది జరిగిన వారం రోజుల తర్వాత-

శ్రావణ శుక్రవారం, గుళ్లో కుంకుమార్చన జరుగుతోంది. అరుంధతమ్మగారు కొత్త కోడల్ని తీసుకుని గుడికి వచ్చింది.

''ఏమండీ పిన్నిగారూ! మీ కోడలా! చాలా బావుంది'' అంటూ పలకరించింది పూజారిగారి భార్య.

''ఆ... కోడలే! అయినా మావాడు ఇలా పెళ్లి చేసుకు వచ్చినందుకు కాదు మేము బాధపడేది, అమ్మాయి కురూపైనా పర్వాలేదు. కులం తక్కువ పిల్లయినా ఏంకాదు. మావాడికి ఎంత లేదన్నా ఇరవై లక్షల కట్నం వచ్చేది. ఇలా రిజిస్టరు మారేజీ చేసుకోవటం వల్ల మాకు ఎంత నష్టం?'' అంటూ అసలు విషయం బయటపెట్టింది. ఇంతసేపూ ఆవిడ బాధ పడింది ఇందుకా? అనుకుంటూ అవాక్కయ్యాను.

-వి.ఉమశ్రీ (గంగారం)